నూర్రూపాయల నోటు

కొ కీ ఫేంటులో తెల్ల షర్టు టక్ చేసుకున్నాడు, రాజారావు. పేరుకి తెల్ల షర్టే గాని, అక్కడక్కడ ముక్కు పొడుం మచ్చలతో, బాగా మాసిపోయి వుంది. ఫేంటు కూడా యెన్నాళ్ళ క్రితమో యిస్త్రీ చేసినట్టుంది. అతని దళసరి కళ్ళద్దాలు, ముక్కు మీదికి జారి వున్నయ్. అతణ్ణి చూస్తే యెవ్వరూ 'ఆఫసరు' అనుకోరు.

కాని, రాజారావు ఆఫీసరు, అతనా అంతస్తుకి యెలా వచ్చాడూ అన్నది వేరే విషయం. !

అతని అంతస్తుకి తగ్గ వస్త్రధారణలో రాజారావుకి శ్రద్ధలేదు. ఆసక్తి అంతకంటే లేదు. అతనికున్న ఆసక్తంతా ఒక్కటే - ధనార్జన! ధనార్జన కోసం అతను తొక్కని మార్గాలుండవు. ఓ రూపాయి ఖర్చు చెయ్యడమంటే, అతనికి బ్లడ్‌ప్రెషర్ పెరుగుతుంది.

అటువంటి రాజారావుకి, ఆఫీసు పని మీద కలకత్తా కోర్టుకి వెళ్ళాల్సిన ఛాన్సు వచ్చింది. అయితే, కలకత్తా వెళ్ళాలంటే, డబ్బుతో పని. తనకెలాగూ ఓ గుమస్తా సహాయం అవసరం గనక, యెవర్ని తీసుకెళ్ళాలా అన్న ఆలోచనల్లో పడ్డాడు. అతని మస్తిష్కంలో చప్పున కాళిదాసు-మెదిలాడు.

కాళిదాసు, బాగా డబ్బున్నవాడు, పైగా నాలుగు డబ్బులు జల్సాగా ఖర్చు బెట్టగలవాడు. అతణ్ణి తన వెలంట కలకత్తా తీసుకువెళ్తే, తనకి లాభసాటిగా వుంటుందనుకున్నాడు. రాజారావు. వెంటనే కాళిదాసుకి కబురు పంపించాడు.

ఆఫీసరు పిలుస్తున్నాడనగానే, పరుగు నడకల్తో వెళ్ళాడు, కాళిదాసు.

"నమస్కారం సార్..." కళ్ళద్దాలు సర్దుకుంటూ అన్నాడు కాళిదాసు.

"నమస్కారం...."

"కబురు పంపించారుట...." నసిగాడు, కాళిదాసు.

"ఔనోయ్, కలకత్తా కోర్టుకి వెళ్ళాలి ఆఫీసు పనిమీద. నాతోపాటు ఓ నమ్మకస్తుణ్ణి, స్మార్ట్‌గా

వుండేవాణ్ణి తీసుకు వెళ్దామనుకుంటున్నాను. ఎవర్ని తీసుకు వెళ్దామా అని ఆలోచిస్తుంటే, నువ్వు నా మనసులో మెదిలావు. ఈ అవకాశాన్ని నీకు యిస్తున్నాను. మనం రేపే బయల్దేరాలి. రిజర్వేషను గురించి నువ్వేం కంగారు పడకు. నేను చేయిస్తాలే. కలకత్తా కాస్ట్లీప్లేసు, అయినా, వెళ్ళక తప్పదు కదా! పైగా ట్రావెలింగు అలవెన్సు దొరుకుతాయి"అన్నాడు, రాజారావు.

"థాంక్స్ సార్! మీ అభిమానానికి కృతజ్ఞుణ్ణి. అన్నాడు మురిసిపోతూ.

తన పాచిక పారినందుకు, లోలోన సంతోషించాడు, రాజారావు.

"రేపు కోరమండల్‌కి వెళ్తున్నాం. గుర్తుంచుకో! నేరుగా స్టేషనుకి వచ్చేయ్."

"అట్లాగేనండీ!" కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరిస్తూ, నిష్క్రమించాడు, కాళిదాసు.

రాజారావు, తనలో తనే నవ్వుకుని, ముక్కు పొడుం డబ్బా తీసి, ఓ పట్టు పట్టించాడు.

✪ ✪ ✪

రాజారావు, కాళిదాసు, కోరమండల్లో బయల్దేరారు. ఇద్దరికీ ఒకే చోట రిజర్వేషను చేయించాడు. రాజారావు. ఆ రాత్రి హాయిగా నిద్రపోయారు.

తెల్లవారింది. కాలకృత్యాలు ముగించుకొని, యిద్దరూ రెడీ అయ్యారు.

"కేటరింగు బేరర్‌కి చెప్పవోయ్ దాసూ, మనిద్దరికీ టిఫీను, కాఫీ తీసుకు రమ్మని..." అన్నాడు రాజారావు.

"అప్పుడే చెప్పేశానండీ! వచ్చేస్తూ వుంటాడు." చిన్నగా నవ్వుతూ అన్నాడు, కాళిదాసు.

రాజారావు, మందహాసం చిందించాడు. "ఇలా వుండాలోయ్ హుషారంటేను! ఇదే, నీకూ మిగిలిన వాళ్ళకి తేడా!" నవ్వుతూనే కాళిదాసుని ఓ మెట్టు పైకెత్తాడు.

అదే సమయంలో టిఫిన్, కాఫీ, పట్టుకుని రానే వచ్చాడు బేరర్. రాజారావు, కాళిదాసు, టిఫిను తీసుకుని, కాఫీ త్రాగారు.

బేరర్ వచ్చి, బిల్లు యిచ్చాడు. రాజారావు హుందాగాపర్సు తీసి, నూరు రూపాయల నోటు అందివ్వఇబోయాడు.

"అంత చిల్లర యెక్కడుంటుంది సార్?" అన్నాడు బేరర్.

రాజారావు, ఆ నోటుని పర్సులో పదిలంగా దాచేస్తూ-

"కాళిదాస్.. నువ్వు యిచ్చేయవోయ్ బిల్లు. తర్వాత మనం చూసుకుందాం." అన్నాడు.

కాళిదాసు మారు మాటాడకుండా బిల్లు చెల్లించాడు.

బేరర్ వెళ్ళిపోయాడు.

హౌరా స్టేషనొచ్చింది. రాజారావు, కాళిదాసూ దిగారు. నేరుగా వెయిటింగ్ రూమ్‌కి వెళ్ళి స్నానం ముగించి, క్లాక్‌రూమ్‌లో సూట్‌కేసుల్ని పడేశారు. కోర్టు కేసు ఫైలు మాత్రం కాళిదాసు చేతిలో వుంది.

"ఇప్పటికే చాలా వేళయ్యిందోయ్ కాళిదాస్! ఒంటిగంటకంతా మనం కోర్టులో వుండాలి. లేకపోతే, మన కేసు అడుక్కి పోతుంది. బస్సులు అవీ రద్దీగా వుంటాయి. లాంచీలో వెళ్తే అక్కణ్ణించి నడవాలి మళ్ళీ. అంచేత,టాక్సీ చేయించుకుందామోయ్." అన్నాడు, రాజారావు.

"అట్లాగేనండీ!" అంటూ టాక్సీ స్టాండు దగ్గరికెళ్ళి టాక్సీ చేయించాడు, కాళిదాసు.

హైకోర్టు ముందే ఆగింది టాక్సీ. రాజారావు నూరు రూపాయల నోటు తీశాడు.

"అంత చిల్లర మా దగ్గరెక్కడిదండీ?" హిందీలో అంటూ చిన్నగా నవ్వేడు టాక్సీ డ్రైవర్.

ఆ నోటుని మళ్ళీ పదిలంగా పర్సులో పెట్టేశారు, రాజారావు.

"కాళిదాసూ, విన్నావు కదా, చిల్లర లేదట, నువ్వు యిచ్చేసెయ్. తర్వాత చూసుకుందాం"అన్నాడు రాజారావు.

"అలాగేనండీ!" బేరమాడిన మేరకు టాక్సీ బాడుగు యిచ్చేశాడు. కాళిదాసు. కోర్టు అటెండెన్స్ అయ్యింది, కేసు వచ్చే నెలకి వాయిదా పడింది.

రాజారావు, కాళిదాసు, కోర్టు ఆవరణ నించి బైటకి పడ్డారు. రాజారావు, ముక్కు పొడుం తీసి పిల్చాడొక్కసారి. "ఆఁ.... గొప్ప ఆకలేస్తోందోయ్ దాసూ! ఎందుకెయ్యదూ! మనం యేం టిఫిన్ చేశాం గనక? మన సౌత్ యిండియన్ మీల్సు యిక్కడో చోట దొరుకుతుంది. పోదాం, పదా..." అంటూ దారి తీశాడు రాజారావు.

హోటల్లోపలికి అడుగుబెట్టి, ఓ టేబిలు ముందు కూచున్నారిద్దరూ.

దాసూ, మీల్సు టిక్కెట్లు రెండు తీసుకోవోయ్. తర్వాత చూసుకుందాం." రాజారావు అన్నాడు.

కాళిదాసుకి, రాజారావు పద్ధతేమీ నచ్చలేదు. నూరు రూపాయల నోటుకి హోటల్లో చిల్లర దొరక్కపోతుందా? తప్పకుండా దొరుకుతుంది. తీసుకుంటే, యేం పోయింది?.... అనుకున్నాడు. మనసులోనే. అయితే, తన మనసులోని భావాల్ని బైటికి వెళ్ళగక్క లేకపోయాడు. ఆఫ్టరాల్, రాజారావు

గారు తన బాస్.. అనుకున్నాడు.

"మనకి మద్రాసు మెయిలు, సులువుగా దొరుకుతుందోయ్ దాసూ! ఏమైనా పర్చేజ్ చేస్తావా?" అడిగాడు రాజారావు.

నిజానికి, యేవో కొన్ని వస్తువులు కొనాలనే అనుకున్నాడు, కాళిదాసు. కాని, రాజారావు పద్ధతి చూస్తుంటే, తనేం కొంటే, అతనూ అదే కొనమని చెప్పేలా వున్నాడనిపించి, ఆ తలంపుకి తిలోదాకాలిచ్చేశాడు.

"అబ్బే! యిప్పుడేమీ కొనదల్చుకో లేదండీ! ఈ సారొచ్చినపుడు చూద్దాం" అనేశాడు, కాళిదాసు.

రాజారావు మొహంలో నిరుత్సాహం చోటు చేసుకుంది. అయినా, మరేం అనలేకపోయాడు. కాస్తంత దూరం యిద్దరూ నడిచారు.

అప్పటికి నాలుగ్గంటలవుతోంది సాయంత్రం. ఎండ తీవ్రత తగ్గుముఖం పడుతోంది.

ఫుట్‌పాత్ మీద మాంచి అరటిపళ్ళు అమ్ముతున్నారు. రాజారావు దృష్టి వాటి మీద పడింది.

"దాసూ, యెంత బావున్నాయోయ్ అరటి పళ్ళు! ఎలాయిస్తున్నాడో అడుగు..."

"కాళిదాసు వెళ్ళి అడిగాడు.

"డజను పది రూపాయలట సార్!" చెప్పాడు కాళిదాసు.

'పది రూపాయలైతేనేం? ఎంత నదురుగా వున్నాయని? ఒక్క అరటి పండు తింటే చాలు, కడుపు నిండి పోతుంది. కలకత్తా వచ్చాక, వట్టి చేతుల్తో వెళ్ళకూడదోయ్... ఏదో తీసుకెళ్ళాలి, ఓ రెండు డజన్లు తీసుకో..." కళ్ళద్దాలు సర్దుకుంటూ అన్నాడు రాజారావు.

"అంటే, మీకో డజనూ, నాకో డజనాండీ?" యీ సారి కాస్త జాగ్రత్త పడినట్టుగా ప్రశ్న వేశాడు, కాళిదాసు.

నువ్వు కొనాలనుకుంటే, మరో రెండు డజన్లు తీసుకో వోయ్... మళ్ళీ దొరుకుతాయా యిల్లాంటివి చెప్పు...."

కాళిదాసు గుండె గుభేలు మంది, వీటికీ నూర్రూపాయల నోటే చూపిస్తాడేమిటి చెప్మా....అను కున్నాడు మనసులో.

'సంచి లేదు కదా సార్ ?' చిన్న పాడివేశాడు.

ఈ విషయాల్లో రాజారావు చాలా జాగ్రత్తగా వుంటాడని కాళిదాసుకి తెలీదు పాపం. అందుకే,

ఆ పాడివేశాడు.

" ఇదిగోనోయ్, నేను తెచ్చానులే సంచీ..." అంటూ ఫేంటు జేబుల్లోంచి తీశాడు రాజారావు ఓ సంచీని.

ఆశ్చర్యపోయాడు కాళిదాసు. రాజారావు, ముందుగానే ప్లాను వేసుకుని వచ్చినట్లు ' అర్థం చేసుకున్నాడు. నాలుగు డజన్లు పళ్ళు తీసుకొని సంచిలో వేశాడు.

" మొత్తం నలభై రూపాయలయింది సార్ !" అన్నాడు. నూరు రూపాయల నోటు చూపిస్తే, చిల్లర తీసుకుందామని కాళిదాసు ఉద్దేశం కాని..

" నూర్రూపాయల నోటుకి వాడి దగ్గర చిల్లర వుండదు లేవోయ్. నువ్వు ఇచ్చేసేయ్. తర్వాత చూసుకుందాం" అన్నాడు రాజారావు.

కాళిదాసుకి యేడుపొచ్చినంత పనయింది. కాని యేడవలేదు. ఏం జేస్తాడు ? తానూ, అతనిలా నూర్రూపాయల నోటే చూపిస్తే బావుండును. కాని, చిల్లరనోట్లు మార్చి తెచ్చినట్లు గురుడుకి తెలుసునాయె. మరో మార్గం లేక, నలభై రూపాయలూ ఇచ్చేసి సంచి పట్టుకున్నాడు కాళిదాసు.

"టాక్సీ ?" అంటూ రాజారావే కేకవేశాడు.

టాక్సీ వచ్చి ఆగింది.

" హౌరా స్టేషనుకి పోనియ్యి.... ' హిందీలో చెప్పాడు రాజారావు.

ఇద్దరు కూర్చున్నారు. హౌరా వచ్చేశారు కొన్ని నిమిషాల్లో.

" దాసూ.. దిగుతూ అన్నాడు, రాజారావు.

"టాక్సీ బాడుగ యిచ్చేస్తా లెండి సార్ !" అతని అభిప్రాయం కనిపెట్టి, తనే సమాధానం చెప్పాడు, కాళిదాసు.

పర్సులోంచి ఇరవై రూపాయలు తీసి డ్రైవరుకి అందించాడు. టాక్సీ వెళ్ళిపోయింది.

" అబ్బ ! ఎంత యెండగా వుందోయ్ దాసూ..." అన్నాడు, రాజారావు.

" చెప్పాలంటే, యెండ తీవ్రత తగ్గిందండీ."

" తగ్గిందనుకో ! అయినా, విపరీతంగా దాహమేస్తోంది. నాలుక, పిడచగట్టిందనుకో ! ఇక్కడ మంచినీళ్ళు వుప్పగా వుంటాయి. అంచేత, లిమ్కా, కూల్‌డ్రింకు తీసుకుందాం పద...' కూల్ డ్రింక్స్ స్టాల్ కేసి దారి తీశాడు, రాజారావు. అతణ్ణి అనుసరించక తప్పలేదు కాళిదాసుకి.

" దో లిమ్కా దీజియే...' రాజారావే ఆర్డరిచ్చాడు.

చల్లగా వున్న లిమ్కా చెరోటి తీసుకున్నారు.

"హమ్మయ్య ! ఇప్పుడు కాస్త హాయిగా వుంది, డబ్బులిచ్చేసెయ్ దాసూ ! తర్వాత చూసు కుందాం.." అదే పాట పాడాడు రాజారావు.

కాళిదాసు, యేం చెయ్యగలడు గనక ? రెండు లిమ్కాలకి డబ్బులిచ్చేశాడు.

కాస్సేపు వెయిటింగ్ రూమ్‌లో విశ్రాంతి తీసుకున్నాక, క్లోక్ రూమ్ నించి సూట్‌కేసుల్ని తెచ్చుకుని, సాయంత్రం టిఫినుకి బయల్దేరారు ఇద్దరూను.

పొరాటా, కూర, తీసుకుని, లస్సీ త్రాగారు. "బిల్లు చెల్లించేయ్ దాసూ ! మనం తర్వాత చూసు కుందాం".

కాళిదాసుకి వొళ్ళు మండిపోతుంది, కాని, యేమీ అనలేకపోతున్నాడు. బిల్లు చెల్లించాడు.

ప్లాట్‌ఫారమ్మీదకి వచ్చేశాడు. మెయిల్లో రెండు బెర్తులు రిజర్వేషను దొరికింది.

తెల్లారాక, పలాసాలో టిఫిను, కాఫీ ముగించారిద్దరూ. వాటి బిల్లు కూడా కాళిదాసు చెల్లించాడు.

వాల్తేరులో దిగాక అన్నాడు రాజారావు "కాళిదాసు మన ట్రిప్ హాయిగా సాగిందోయ్. నీలాటివాడు వెంట వుంటే ఇబ్బంది అంటూ యేమీ వుండదు. ఖర్చంతా యెంతయ్యిందో, రాసి ఇవ్వు రేపు నూర్రూపాయల నోటు మార్చి ఇచ్చేస్తాను" అని

" అలాగే సార్ !" సవినయంగా అన్నాడు కాళిదాసు.

కాళిదాసు తన రెండు డజన్ల అరటిపళ్ళు తీసుకుని,

" మరి, వస్తాను సార్ ! బస్సులో వెళ్ళిపోతాను ఇంటికి". అన్నాడు.

రాజారావు సన్నగా నవ్వేడు.

" ఇంత పిసినారి వెప్పుడయ్యావోయ్ ? రైలు ప్రయాణం చేశాక, బస్సులో ప్రయాణం చేయడం, అంత సుఖమనుకుంటున్నావా ? హాయిగా ఓ ఆటో యేర్పాటు చెయ్యి. మా ఇంటి దగ్గర నన్ను డ్రాప్ చేసి, నువ్వెళ్ళిపోదువుగాని... 'అన్నాడు.

కాళిదాసు, మరేం మాట్లాడలేకపోయాడు. ఆటో యేర్పాటుచేసుకుని, ఇద్దరూ బయల్దేరారు.

✪ ✪ ✪

మర్నాడు కాళిదాసు ఆఫీసుకొచ్చినపుడు, ఖర్చంతా ఓ కాగితం మీద రాసి, రాజారావు అతనికిచ్చాడు. ఆ కాగితం వేపు కాస్సేపు చూశాడు. రాజారావు. ఏదో తాను మాట వరుసకి చెప్పినా, కాళిదాసు రాసిస్తాడని అతనూహించలేదు.

" సరేలేవోయ్ దాసూ ! నూర్రూపాయల నోటు మార్చియిస్తాలే" అన్నాడు.

కాళిదాసు అప్పటికి వెళ్ళిపోయాడు.

రాజారావు అలా అనేశాడే గాని కాళిదాసుకి ఆ డబ్బు ఇవ్వనే లేదు.

కాళిదాసు అడగనూలేదు. నలుగురు స్నేహితులతో చెప్పుకుని బాధపడ్డాడు. మరిచిపోలేని ఆ అనుభూతులే అతనికి మిగిలినయ్.

✪ ✪ ✪

మరికొద్ది రోజుల తర్వాత. కాళిదాసుని పిల్చాడు. రాజారావు.

"మళ్ళీ కలకత్తా వెళ్ళాల్సి వుందోయ్ దాసూ ! నీ పేరే నేను సజెస్టు చేస్తున్నాను." చెప్పాడు, రాజారావు.

కాళిదాసుకి షాక్ తగిలినట్టయింది. రాజారావు వెంట వెళ్ళడం అతనికి ఇష్టం లేకపోయింది.

"నాకు వీలుపడదు సార్ !" ముక్తసరిగా అన్నాడు.

"ఏం?" యిసారి షాక్ తినడం రాజారావు వంతయ్యింది.

ఏం కారణం చెప్పాలో, చప్పున తట్టలేదు కాళిదాసు మెదడుకి, ఏదో చెప్పాలి మరి !

మా ఆవిడకి డెలివరి టైమ్ సార్ ! అంచేత రాలేను'.

అబద్ధం చెప్పాడు, కాళిదాసు.

రాజారావు మరేం అనలేకపోయాడు.

"' అలాగా ! సరేలే ! ఇంకెవరినో తీసుకెళ్తా..."

నీరసంగా అన్నాడు, ముక్కుపొడుం పీలుస్తూ.

బ్రతుకు జీవుడా, అనుకొని బైట పడ్డాడు, కాళిదాసు. ఆనాటి సంఘటనలన్నీ అతని మెదడులో గిర్రున తిరిగినయ్. నవ్వుకున్నాడు. రాజారావు దగ్గరున్న నూర్రూపాయల నోటే గుర్తుకొచ్చిందతనికి.

□□□

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక 14.11.86)